www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 10 డిసెంబర్ 2024

5

కాకినాడ



వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారుల చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని వినియోగదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బళ్లమూడి సూర్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక సాగర్ మున్సిపల్ హైస్కూల్లో జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన వర్చువల్ విచారణ, డిజిటల్ ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. వస్తు సేవలకు సంబంధించి కొనుగోలు చేసినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో హెచ్ఎం కెవివిఎస్.ప్రసాద్, ఉపాధ్యాయులు రామలక్ష్మి, ఎం.శివప్రసాద్, బి.పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపిమూర్తిదే గెలుపు

- ఎంఎల్‌సి ఎన్నికల్లో ఘన విజయం
- మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే గెలుపు
- 9,165 ఓట్లను సాధించిన పిడిఎఫ్ అభ్యర్థి
- ప్రత్యర్థి నారాయణరావుపై 3,906 ఓట్ల మెజారిటీ



ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గోపిమూర్తి



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి ఉభయ గోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తికే గురువులు ఫస్ట్ ర్యాంకును ఇచ్చారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లలోనే ఆయనకు ఘన విజయాన్ని అందించారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సోమవారం కాకినాడ జెఎన్‌టియు ప్రాంగణలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జెసి రాహుల్ మీనా, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికలో మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. 16,737 మంది ఓటర్లకు 15,494 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో 814 ఓట్లు చెల్లనివిగా అధికారులు ధ్రువీకరించారు. మిగిలిన 14,680 వ్యాలిడ్ ఓట్లలో విజయానికి అవసరమైన కోటా ఓట్ల సంఖ్య 7,341న గోపిమూర్తి తొలి రౌండ్‌లోనే అధిగమించి విజయాన్ని సొంత చేసుకున్నారు. రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆయనకు ధ్రువపత్రాన్ని అందించారు. సమీప ప్రత్యర్థి నారాయణరావుపై 3,906 ఓట్ల మెజారిటీని గోపిమూర్తి సాధించారు.

విజయోత్సవ ర్యాలీ

లెక్కింపు పూర్తయిన వెంటనే పలువురు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, యుటిఎఫ్ నాయకులు, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు జెఎన్‌టియుకె వద్దకు చేరుకున్నారు. పూలమాలలతో గోపిమూర్తికి ఘనంగా స్వాగతం పలికారు. జెఎన్‌టియుకె నుంచి భానుగుడి, కలెక్టరేట్ మీదుగా బైక ర్యాలీతో యుటిఎఫ్ హోమ్‌కు చేరుకున్నారు. పిడిఎఫ్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి పేరు	వచ్చిన ఓట్లు
బొర్రా గోపిమూర్తి	9165
జి.నారాయణరావు	5259
పులుగు దీపక్	102
కవల నాగేశ్వరరావు	73
నిమ్మల వెంకటలక్ష్మి	81



నాయకుల అభినందన



ర్యాలీగా...

ఉపాధ్యాయ సమస్యలపై గళం విప్పుతా...

మీడియాతో గోపిమూర్తి

ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన తాను ఇక నుంచి ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై, ప్రజా సమస్యలపైన శాసన మండలిలోనూ గళం విప్పుతానని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి తెలిపారు. సోమవారం కౌంటింగ్ పూర్తయిన తరువాత ఆయన జెఎన్‌టియుకె ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్ అభ్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా గురువులు నిజాయతీకే పట్టం కట్టారన్నారు. భారీ మెజారిటీని అందించి ప్రజాస్వామ్య విలువల్ని కాపాడినందుకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఇప్పటికే వివిధ ఉపాధ్యాయ సమస్యల పరిష్కార కోసం తాను అనేక పోరాటాలు చేశానని, భవిష్యత్తులో తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానన్నారు. ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ టీచర్లకి సంబంధించి జిఒ 3ని సుప్రీంకోర్టు కొట్టి వేసిందన్నారు. దానికి చట్టబద్ధత కల్పించేలా ఎన్నికల్లో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. దానిని అమలు చేయాలన్నారు. కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రటాక్ట్ లెక్చరర్స్‌ను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. గెస్ట్ లెక్చరర్లు, అధ్యాపకేతర సిబ్బందికి మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని తక్షణం విరమించుకోవాలని కోరారు. సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యా రంగానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో గురువుల సంక్షేమానికి నిధులు కేటాయించట్లేదన్నారు. వారికి ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే సెలవులు, టైం స్కేల్‌ను అందించాలన్నారు. వారికి హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రజల పక్షాన శాసనమండలిలో తన గొంతును వినిపిస్తానని తెలిపారు. బోధనేతర పనులను నిలిపేయాలన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించకుండా కంప్యూటర్ ఆపరేటర్‌ను ఇవ్వకుండా ఉపాధ్యాయులతో ఈ పనులు చేయించడం తగదన్నారు.





విజయోత్సవ సభలో మాట్లాడుతున్న గోపిమూర్తి

ఇది అందరి విజయం

గోపిమూర్తి విజయోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

టీచర్స్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి విజయానికి అనేక మంది ఎంతో కష్టి చేశారని ఇది అందరి విజయం అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో సోమవారం గోపిమూర్తి విజయోత్సవ సభ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నారం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడారు. గోపిమూర్తి విజయం వెనక యుటిఎఫ్‌తో పాటు అనేక ప్రజా, కార్మిక సంఘాలు నిరంతరం పని చేశాయన్నారు. పిడిఎఫ్‌గా ఇది హ్యాట్రిక్ విజయం అని తెలిపారు. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ పక్షాన ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో పిడిఎఫ్ తరపున రాష్ట్రంలో ప్రజా సమస్యలపైనా గళం విప్పుతామని స్పష్టం చేశారు.

విజయం సాధించిన గోపిమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది యుటిఎఫ్ స్వర్ణోత్సవాల వేళ ఈ విజయం మరువలేనిదన్నారు. కొంత మంది కార్పొరేట్ అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసినప్పటికీ మెజారిటీ ఓటర్లు తన వైపు నిలబడి భారీ విజయాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా పిడిఎఫ్‌ను ఢీకొట్టే అభ్యర్థులు ఉండబోరని మరోసారి నిరూపించారన్నారు. పెద్దల సభలో ప్రజా సమస్యలపై నిరంతరం గళం విప్పుతానని హామీ ఇచ్చారు. నీతికి నిజాయితీకి పట్టం కట్టిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. మార్చిలో జరగబోయే పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానాన్ని కూడా తిరిగి మనమే సాధించాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన అన్నారం మాట్లాడుతూ ఇదొక చారిత్రక విజయం అన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ ఈ విజయం సామాన్య విజయం కాదన్నారు. కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకులు మాణిక్యం, సుందరయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం పనిచేస్తున్నారన్నారు అటువంటి వ్యక్తులను శాసన మండలికి పంపించడం అందరి బాధ్యత అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గోపిమూర్తి విజయం సాధించిన తర్వాత యుటిఎఫ్ కి మరింత బాధ్యత పెరిగిందన్నారు. హ్యాట్రిక్ విజయాన్ని సాధించిన ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం ఉన్న వారందరూ ఈ విజయంలో భాగస్వామ్యం పొందారన్నారు. ప్రజా ఉద్యమం కోసం పనిచేసే వారికి యుటిఎఫ్ ఎప్పుడూ సహకారం అందిస్తుందన్నారు. తొలుత అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఎల్‌సిలు ఐవి, గోపిమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.జ్యోతిబసు, కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేష్, టి.చక్రవర్తి, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం



శిబిరంలో మోకాళ్లపై ధర్నా చేస్తున్న కార్మికులు

మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని కోరుతూ కార్మికులు సోమవారం మోకాళ్ళపై కూర్చుని దండాలు పెడుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత 24 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ పట్టించు కోవడం లేదన్నారు. కమిటీని నియమిస్తామని కలెక్టర్ ఇచ్చిన హామీని అమలు చేయలేద న్నారు. ఫ్యాక్టరీ మూసివేతతో ఉపాధి లేక కార్మికులు అర్థాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఫ్యాక్టరీపై ఆధార పడి సుమారు 409 మంది కార్మికుల కుటుంబాలు జీవిస్తున్నాయని అన్నారు. ఒకపక్క రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలను తీసుకొస్తున్నామని, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని కూటమి ప్రభుత్వం ప్రకటిస్తుందని, మరోపక్క లాభాల్లో నడుస్తున్న పరిశ్రమలను యాజమాన్యాలు మూసివేస్తుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, అధికారులు స్పందించి ఫ్యాక్టరీని తెరిపించేందుకు చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వీరబాబు, చక్రధర్, గోవింద్, జయలక్ష్మి, శివలక్ష్మి, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


గుంటూరు మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సామర్లకోట

ఈనెల 15న గుంటూరులో జరిగే మాలల మాహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాలమహానాడు నాయకులు లింగం శివప్రసాద్, సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో అఖిల భారత మాల సంఘాల జెఎసి, పెద్దాపురం నియోజకవర్గ ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌సిల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 15న జరగనున్న మాలల మహాసభ విజయవంతానికి అవసరమైన కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశానికి పెద్దాపురం నియోజవర్గ పరిధిలోని దళితులను భారీగా తరలించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు జానకిరామారావు, బాబీ, హరిబాబు, పిట్టా సత్య నారాయణ, వారా సుధాకర్, సత్య నారాయణ, రవీంద్ర, మాజీ జడ్‌పిటిసి బంగారుకృష్ణ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ భారాలు మోసేదెలా..?

- ఎఫ్‌పిపిసిఎ పేరిట అదనపు వసూళ్లు
- ఒక్కో బిల్లుపై పై రూ.100 నుంచి
- రూ.400 వరకూ భారం


NAME KAMUJUDHANA
ADDR 71-16-2POLICE QUATER
CAT :1 PH :1
SCAT : LT Domestic - Domestic
CONTRACTED LOAD 3.0KW
CONNECTED LOAD 3.0KW
MNo 5641019 MF:1.0

READING	MONTH	STS
PRES KWH	9714 06-12-2024	1
PREV KWH	9597 07-11-2024	1
AVG UNITS		217
BILLED UNITS		117
RMD		1.34KVA

ENERGY CHRG	486.69
FIXED CHRG	30.00
CUST CHRG	45.00
ED	7.02
SURCHARGES	0.00
ED INT	0.06
TRUEUP CHRG	0.00
FPPCA CHRG	397.22
FPPCA2 CHRG	82.00
SHORTFALL	0.00
ACD SURCHRG	0.00
FAN INSTAL	0.00
ADJ AMOUNT	0.00
LOSS/GAIN	0.01
BILL AMOUNT	1048.00
GOVT SUBSIDY	106.00
BILL AFT SUB	942.00
ISD-TDS :	0.00
ARREARS	
BEF 01/04/24	0.00
AFT 01/04/24	-0.01
NET BILL	941.99
DUE DATE	20-12-2024
DISC DATE	05-01-2025

E&OE For AAO/ERO
SD AVAILABLE 600
ACD TO PAY 0.0

ఉంగరాల శాంతి సరస్వతి రాజమండ్రిలో నివాశం ఉంటుంది. ఇంటికి నవంబర్ నెలలో రూ.580 కరెంటు బిల్లు చెల్లించింది. డిసెంబర్ నెల విద్యుత్ బిల్లు ఏకంగా రూ.941 రావడంతో అవాక్కైంది. డిసెంబర్ నెలలో 117 యూనిట్లకు ఎనర్జీ ఛార్జి రూ.486.69, ఫిక్స్‌డ్ ఛార్జి రూ.30, కస్టమర్ ఛార్జి రూ.45, ఇడి ఛార్జి రూ.7.02 మొత్తంగా రూ.568.69 అయ్యింది. అయితే ఇదే బిల్లులో ఎఫ్‌పిపిసిఎ 397.22, ఎఫ్‌పిపిసిఎ-2 రూ.82 రెండూ కలిపి అదనంగా రూ.479.22 పడింది. గవర్నమెంట్ సబ్సిడీ రూ.106 పోను మొత్తంగా ఈ నెల బిల్లు రూ.941 వచ్చింది. వాడుకున్న కరెంటుకు సంబంధించి రూ.568 బిల్లుకాగా ఎఫ్‌పిపిసిఎ సర్‌ఛార్జీల పేరిట అదనంగా రూ.479.22 వసూలు చేయడంతో ఆందోళన చెందుతుంది. వాడకం ఛార్జీల కంటే సర్ ఛార్జీలు ఎక్కువ అయ్యిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తుంది.

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కోనాల రామకృష్ణ బిక్కవోలులో నివాసం ఉంటున్నాడు. ఆయనకు నవంబర్ బిల్లులో 252 యూనిట్లకు రూ.1,442 వచ్చింది. ఇందులో ఎఫ్‌పిపిసిఎ-2 ఛార్జి రూ.84 వేశారు. శీతాకాలం కావడంతో నవంబర్‌లో కరెంటు వాడకం తగ్గించారు. 203 యూనిట్లు వాడారు. దీనికి సంబంధించి డిసెంబర్‌లో రూ.1,176 బిల్లు వచ్చింది. ఇందులో ఎఫ్‌పిపిఎ ఛార్జి పేర రూ.106.36, ఎఫ్‌పిపిసిఎ -2 పేర మరో రూ.89 వసూలు చేశారు. వాడుకున్న దానికంటే అదనంగా రూ.195 చెల్లించాల్సి వచ్చిందని వాపోయాడు. రామకృష్ణ, శాంతి సరస్వతిలకే కాదు ఇలా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 18.58 లక్షల వినియోగదారులపై సర్‌ఛార్జీల భారం పడింది.

ఎన్నికల సమయంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారు. కాని అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే సర్‌ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరిట ప్రజలపై భారాన్ని మోపారు. నవంబర్‌లో ఎఫ్‌పిపిసిఎ పేరిట మాత్రమే అదనపు ఛార్జీ పడగా డిసెంబర్‌లో వచ్చిన బిల్లులో ఎఫ్‌పిపిసిఎతో పాటూ ఎఫ్‌పిపిసిఎ-2తో అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఇదేంటి అని ప్రశ్నిస్తుంటే బదులిచ్చే నాధుడే కరువవుతున్నారు. శీతాకాలం నేపథ్యంలో విద్యుత్ వాడకం గణనీయంగా తగ్గింది. అయినప్పటికీ డిసెంబర్ నాటి కరెంట్ బిల్లుల్లో మాత్రం తగ్గుదల కనిపించలేదు. కారణం ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలే. విద్యుత్ యూనిట్ ధర పెంచకుండా సర్దుబాటు ఛార్జీల పేరుతో ఇలా అడ్డగోలుగా ప్రభుత్వం ప్రజలను దోచేస్తోంది. ఒక్కో బిల్లుపై ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు రూ.100 నుంచి రూ.400 వరకూ వేస్తున్నారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై రూ.18 కోట్ల నుంచి రూ.74 కోట్ల వరకూ భారం పడనుంది. ఇప్పటికే ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సర్‌ఛార్జీల భారం మూలిగేనక్కపై తాటిపండు పడ్డ చందాన ఉంది.

ఈ నెల రూ.139 అదనంగా వచ్చింది

ప్రతి నెలా 210 నుంచి 230 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తున్నాము. ఆర్యాపురంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాము. సర్వీసు నెం.1432022204007877 సర్వీసు నెంబరుకు గత నెల రూ.950నుంచి రూ.1100 వరకూ బిల్లు వచ్చేది. ఈ నెల రూ.1239బిల్లు వచ్చింది. గత నెలతో పోల్చితే విద్యుత్ వినియోగం పెరగలేదు. అయినప్పటికీ సుమారు రూ.150 అదనంగా బిల్లు వచ్చింది.

- బి.రాజేశ్వరి, గృహిణి, రాజమండ్రి

పెంచబోమని చెప్పి భారాలు వేస్తున్నారు

కరెంట్ బిల్లులు పెంచబోమని ఎన్నికల సమయంలో చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే కరెంటు ఛార్జీల భారం వేయడం చాలా దారుణం. సర్‌ఛార్జీల పేర ఇలా భారాలు వేయడం తగదు. వెంటనే సర్ ఛార్జీని రద్దు చేయాలి.

- కర్రి అచ్చిరెడ్డి, బలబద్రపురం




వినియోగం తగ్గినా అదనంగా బిల్లు

ప్రతి నెలా సుమారుగా 100 యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తుంటాము. గోకవరం బస్టాండ్ వద్ద చిరువ్యాపారం చేసుకుంటూ జీవని సాగిస్తున్నాం. మా సర్వీసు నెం.1432022204103839 నెంబరుకు గత నెల 99 యూనిట్లు విద్యుత్ వినియోగించగా రూ.1044 కరెంటు బిల్లు జారీ చేశారు. ఈ నెల 93 యూనిట్లు మాత్రమే విద్యుత్ వినియోగించినప్పటికీ రూ.1077 బిల్లు జారీ చేశారు. 6 యూనిట్లు విద్యుత్ వినియోగం తగ్గినప్పటికీ రూ.67 బిల్లు అదనంగా వచ్చింది.

బివి.పద్మావతి, చిరు వ్యాపారి, గోకవరం బస్టాండ్,

కార్టూన్ 'నిజం'



గోపిమూర్తి విజయంపై యుటిఎఫ్ హర్షం

ప్రజాశక్తి - యంత్రాంగం



గోపిరాజుకు అభినందనలు చెబుతున్న రౌతులపూడి యుటిఎఫ్ నేతలు

కాజులూరు ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపర్చిన బొర్రా గోపిమూర్తి విజయంపై యుటిఎఫ్ మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. యుటిఎఫ్ మండల అధ్యక్షులు వెంటపల్లి భానుప్రకాష్ మాట్లాడుతూ టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికలలో యుటిఎఫ్ తరపున పోటీ చేసిన గోపిమూర్తి విజయంతో ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై మండలిలో తన గళాన్ని విప్పేందుకు ఈ విజయం దోహదం చేస్తుందన్నారు. ఆయన విజయం పట్ల ఉపాధ్యాయులు నున్నబోయిన గణేష్, రాయుడు సుధీర్, సాపే శ్రీనివాస్, వనుం గౌతమి, రాయుడు పాండురంగారావు, డి.మీనాకుమారి హర్షం వ్యక్తం చేశారు. **రౌతులపూడి** పిడిఎఫ్ బలపర్చిన గోపిమూర్తి విజయం పట్ల యుటిఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు కొరుప్రోలు హరిబాబు, యుటిఎఫ్ నేతలు కెవి.రమణ, నాగరాజు, బి.తాతబాబు తదితరులు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గోపిమూర్తి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. **కరప** టీచర్స్ ఎంఎల్‌సిగా బొర్రా గోపిమూర్తి విజయం పట్ల మండల యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ కెవి.రమణ, జిల్లా ఆడిట్ కమిటీ అధ్యక్షులు ఐ.ప్రసాద్‌రావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పేపకాయల రాజుబాబు, ప్రజా సంఘాల నాయకులు సిహెచ్.రమణి, ఆర్.వెంకటలక్ష్మి, వీరవేణి, వరలక్ష్మి, కల్పలత సిఐటియు నాయకులు రాంప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల బాబు

ఐక్యతతో పార్టీని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పార్టీని బలోపేతం చేయాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సమస్యలను ఆయన కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను గుర్తించడమే కాకుండా వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జనసేన మండల అధ్యక్షులు దాసు శివబాబు, పాఠంశెట్టి రాఘవ, బాబ్జీరావు, జట్ల విజయ్, మలిరెడ్డి బుచ్చిరాజు, కంచుమర్తి రాజన్న, సబ్బినీడి ఈశ్వరరావు, నూకరాజు, రవి, అంబటి రాంబాబు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బెదిరింపులపై ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో రెండంతస్తులు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తామని సచివాలయ సిబ్బంది బెదిరించడాన్ని నిరసిస్తూ కాలనీవాసులు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 50 గజాలు స్థలం ఇచ్చి గృహాన్ని నిర్మించుకోవాలని, లేకుంటే స్థలాన్ని వెనక్కి తీసుకుంటామని గతంలో వాలంటీర్లు బెదిరించే వారన్నారు. దీంతో ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చిన అప్పులు చేసి మరి గృహాన్ని నిర్మించుకున్నామని చెప్పారు. ఇంటిల్లాపాదికి ఆ గృహం సరిపోకపోవడంతో ఆ పైనే మరో అంతస్తు నిర్మించుకున్నామని, అయితే ఇప్పుడు ఆ ఇళ్లను కూల్చివేస్తామని సచివాలయ సిబ్బంది బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు. తక్షణమే కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణకు, కౌన్సిలర్ అలమండ చలమయ్యకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మహిళ అదృశ్యమైన ఘటనపై సోమవారం పోలీసులు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. నగర పంచాయతీ పరిధిలోని రాయుడు పాలెం చెందిన బొక్కా విజయరాజు తల్లి వెంకటరమణ అనారోగ్యంతో బాధపడుతోంది. 2 రోజుల క్రితం ఆమె ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కోసం బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ తెలియలేదని ఆమె కుమారుడు విజయ రాజు పోలీసులకు సోమ వారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వ్యక్తి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన తోట త్రిమూర్తులు(30) మానసిక వ్యాధితో బాధ పడుతున్నాడు. అందుకు మందులను వాడుతున్నాడు. 20 రోజులుగా మందులను వాడటం మానేశాడు. దీంతో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో అతడు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే అతనిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న నేపథ్యంలోనే అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి మామిడాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవిఎస్.అప్పారావు తెలిపారు. అలాగే ఒక వ్యక్తి నుంచి 11 అక్రమ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానాలు, జైలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు, ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 12 మందికి రూ.10 వేలు చొప్పున ప్రత్తిపాడు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కాకం భాను జరిమానా విధించారని సిఐ సిహెచ్ సూర్యఅప్పారావు తెలిపారు. అలాగే మరో ఇద్దరికి 7 రోజులు చొప్పున జైలు శిక్షను విధించారని తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు-కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్నట్లు జిఆర్‌పి హెచ్‌సి శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు కడి చేయిపై ఈశ్వర్ అనే పచ్చబొట్టు ఉందని, కుడిచేయి జబ్బ మీద త్రిశూలం, నాగుపాము, డమరుకం గుర్తులు కలిగిన పచ్చబొట్టు ఉన్నాయని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పి హెచ్‌సి తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 9490617090, 9948010061 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - జగ్గంపేట

రాష్ట్రంలో పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. సోమవారం స్థానిక కాకినాడ రోడ్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద దాతల సాయంతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గొల్లపల్లి మండలం మురారి గ్రామ ఉపసర్పంచ్, టిడిపి యువనేత జాస్తి వసంత్ ఆర్థిక సాయంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలకు భోజనం వడ్డించి కూటమి ప్రభుత్వం పేదవాని ఆకలి తీర్చడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జాస్తి వసంత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వియస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, సర్పంచ్ అడబాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రౌతులపూడి, బలరామపురం, ఎస్.అగ్రహారం జడ్‌పి ఉన్నత పాఠశాలలను సోమవారం డిఇఒ పి.రమేష్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను కలుసుకున్నారు. వారిలో ఉన్న విద్యా ప్రమాణాలను పరీక్షించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపుదలకు తీసుకుంటున్న చర్యలపై హెచ్‌ఎంలతో చర్చించారు. ప్రతి విద్యార్థికి అపార్ నెంబర్ జనరేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికను అమలు చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో దోహదం చేస్తుందని ఎంఇఒ-2 పి. పుల్లయ్య అన్నారు. కరాటేలో ఎల్లో బెల్ట్‌ను సాధించిన మండలంలోని అచ్చంపేట యుపి పాఠశాలకు చెందిన విద్యార్థులను ఎంఇఒ సత్కరించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్యంతోపాటు, ఎటువంటి విపత్కర పరిస్థితి ఆయనా ఎదుర్కొనేందుకు కరాటే దోహదం చేస్తుందన్నారు. కరాటే శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, ఎస్‌ఎంసి చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమ్మెలోకి ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు సోమవారం నుంచి సమ్మె బాట పట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని గత కొంతకాలంగా కార్మికులు వివిధ రూపాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో వారు సమ్మెను ప్రారంభించారు. జిల్లాలోని పలు మున్సిపాలిటీ కార్యాలయాల ముందు సమ్మె శిబిరాలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం


పెద్దాపురంలో ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికులు

పెద్దాపురం సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారు. రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులు రూ.24,500 వేతనం ఇవ్వాలని, 15 సంవత్సరాల సర్వీసు పైబడిన వారిని క్రమబద్ధీకరించాలని, ఆదివారాలు, జాతీయ, రాష్ట్ర సెలవులు 72 రోజులు సెలవులుగా ప్రకటించాలని, ఆ రోజులకు వేతనాలు ఇవ్వాలని, మరణించిన కార్మిక కుటుం బానికి రూ 10 లక్షలు, వైకల్యం పొందిన కార్మికునికి రూ.5 లక్షలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యో గం ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఈ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటికోసం గత కొంతకాలంగా పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో సమ్మెబాట పట్టవలసి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కోనాల వెంకటరమణ, బి.వీర భద్రరావు, స్వామి, రామకృష్ణ, సాయి పాల్గొన్నారు. అలాగే **సామర్లకోట** మున్సిప్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ విభాగంలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్య క్షులు ఉండవల్లి వివి.రామరాజు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో సమ్మె బాట పట్టాల్సివచ్చిందన్నారు. తమ న్యాయబద్ధమైన డిమాం డ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి పులపకూరి రామకృష్ణ, ఉప కార్యదర్శి కాటంరెడ్డి ఏసు, కోశాధికారి నక్క రత్నరాజు, ఇంజనీరింగ్ కార్మి కులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మున్సిపల్ ఇంజి నీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు. యూని యన్ నాయకులు తాలారి తాతాజీ, పడాల సూరి బాబు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరిం చాలని ఇప్పటికే వివిధ రూపాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం మొండిగా వ్యవహరించడంతో సమ్మెలోకి దిగామని అన్నారు. ఈ కార్యక్రమంలో తలారి సురేష్, సిద్ధా శ్రీను, మొగిలి స్వామి పాల్గొన్నారు.


సామర్లకోటలో ధర్నా చేస్తున్న కార్మికులు


గొల్లప్రోలులో ధర్నా చేస్తున్న కార్మికులు

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట


అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఇఒ

రానున్న సమ్మె టివ్, అసమ్మెటివ్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఎంఇఒ వై.శివ రామకృష్ణయ్య ఆదేశించారు. సోమవారం మండలంలోని గొంచాల ప్రాథమిక పాఠశాల -1, నవర, ఉప్పరగూడెం జడ్‌పి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు పఠన, రాత నైపుణ్యాలతోపాటు, విద్యార్థుల వర్క్, టెక్స్ బుక్ కరెక్షన్స్, సిలబస్‌ను పరిశీలించారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్‌లోనీ అంశాలను చదవాలని, రాయాలని దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, రుచి చూసి, పిల్లలకు వడ్డించి, భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి టిడిపి నాయ కులు రేలంగి బుజ్జి పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, ఎస్ఐ వి.మౌనిక, పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్ పాల్గొన్నారు. పవర ట్రినిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ యాళ్ల రాజా, డాక్టర్ మోహన్‌విజయ్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ కిషోర్, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ రామ్మూర్తి, హెచ్‌ఆర్.కమలాకర్, సిబ్బంది వైద్య సేవలు అందించారు. అసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే అక్షయ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 28 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్య క్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, కంటిబోయిన వెంకటేశ్వరరావు, తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, తుమ్మల నాని, కొమ్మిరెడ్డి బుజ్జి, అంబటి సూర్యప్రకాశరావు, వెంకటరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 11వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలని డిప్యూటీ కలెక్టర్, తాళ్ళరేవు, కాజులూరు మండలాల ప్రత్యేక అధికారి డి.భారతి అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు ఏ రకమైన రెవెన్యూ సమస్యలు ఉన్న దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.త్రినాధరావు, దేవాదాయ శాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిటి సుబ్బారావు, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

వాలీబాల్ యూనివర్సిటీ జట్టు ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని గొల్లల మామిడాడలో డిఆర్‌కె.రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీ వాలీబాల్ టోర్నమెంట్ యూని వర్సిటీ టీం జట్లు ఎంపిక పోటీలు ప్రారంభం అయ్యాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృ ష్ణారెడ్డి ప్రారంభించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలో నుంచి విచ్చేసిన వాలీబాల్ పురుషుల జట్లు ఈ పోటీలలో తలపడనున్నాయి. ఈ కార్యక్రమంలో కాలేజీ ఫౌండర్ డిఆర్‌కె.రెడ్డి, కరస్పాండెంట్ ద్వారంపూడి వివేకానంద రెడ్డి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాసరెడ్డి, డిఆర్‌కె.రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ ఎస్.శివన్నారాయణ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకట్రావు, యూనివర్సిటీ పరిశీలకులు సత్యనారాయణ, కమిటీ మెంబర్స్ పవన్‌కుమార్‌రాజు, అనిల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ద్వారంపూడి' వల్ల పోర్టు కార్మికులకు నష్టం

ప్రజాశక్తి - కాకినాడ

మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అవినీతి, అక్రమాల వల్లే కాకినాడ పోర్టు కార్మికులకు నష్టం వాటిల్లుతుందని టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కార్యదర్శి తుమ్మల రమేష్ అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోర్టులో ఎగుమతి, దిగుమతుల్లో ప్రథమ స్థానంలో ఉండి మంచి గుర్తింపు పొందిన కాకినాడ పోర్టుని వైసిపి పాలనలో ద్వారంపూడి అక్రమ సంపాదన కోసం బియ్యం, మాదక ద్రవ్యాలతో అక్రమ రవాణాకు అడ్డాగా మార్చేశారని అన్నారు. తద్వారా కాకినాడ పోర్టులో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు నేడు రోడ్డున పడే పరిస్థితిని తీసుకొచ్చారని అన్నారు. . కొమరగిరి లేఔట్‌లో కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. త్వరలోనే ద్వారంపూడి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గదుల సాయిబాబా, ఎండి తాజుద్దీన్, బచ్చుశేఖర్, రవి, బంగారు సత్యనారాయణ, కోడూరు కుమారస్వామి, అమలకంటి బలరాం, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడింది వైసిపి నేతలే : వర్మ

ప్రజాశక్తి - పిఠాపురం

కెఎస్ఇజెడ్ భూముల సేకరణలో అవినీతికి పాల్పడింది వైసిపి నేతలేనని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ఆరోపించారు. కెఎస్ఇజెడ్ వ్యవహారంపై బహిరంగ చర్చకు రావాలని వైసిపి నేతలు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, వంగా గీతలకు సవాల్ విసిరిన వర్మ సోమవారం సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం నుంచి ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌కు టిడిపి శ్రేణులతో ర్యాలీగా చేరుకున్నారు. ఉప్పాడ బస్టాండ్ సెంటర్లో వైసిపి నేతల పేర్లు రాసి కుర్చీలు సైతం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సెజ్ భూములు సేకరణలో ఏ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్యాయం, న్యాయం జరిగిందో తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. సెజ్ పేరుతో రైతులను నిండా ముంచిన పాపం వైఎస్ఆర్‌దేనని మండిపడ్డారు. 8 వేల ఎకరాలకు చంద్రబాబు పాలనలో ఎకరాకు రూ.2 లక్షల అదనంగా కలెక్టర్ల సమక్షంలో రైతులతో మాట్లాడి రూ.160 కోట్లు అదనంగా ఇప్పించారని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ భూములు బెదిరింపులతో బలవంతంగా లాక్కుని రైతులకు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని ఆయన దుయ్యబట్టారు. బహిరంగ చర్చకు రాని వారు తమ నేతను విమర్శించే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, సెజ్ రైతులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందు దుకాణంలో తనిఖీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని ఎరువులు పురుగుమందు దుకాణంపై అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఎడి పి.మాధవి ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని లింగంపర్తిలో అక్రమంగా నిల్వ ఉంచిన వరి విత్తనాలను గుర్తించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ లింగంపర్తి కొండ తిమ్మాపురం రోడ్డులో గల జి.శేషగిరికి చెందిన 17 బస్తాలు లైసెన్సు లేకుండా వరి విత్తనాలను నిల్వ ఉంచి రైతులకు విక్రయిస్తున్నారన్నారు. షాప్ యజమానిపై 6ఎ కేసు నమోదు చేశామన్నారు. ఫార్మ్ ఇన్ క్లూషన్ లేకుండా ఎరువులు పురుగుమందులు విక్రయించడం నేరమన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలని, రైతులకు విత్తనాలు, పురుగుమందులు ఎంఆర్‌పి ధర కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎల్ ల్యాబ్ ఎఒ కరుణాకర్, మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి, విఆర్‌ఒలు సిహెచ్.నాగేశ్వరరావు, వై.లక్ష్మి పాల్గొన్నారు.

బాధితుల కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


నగదును అందిస్తున్న ముదునూరి

మండలంలోని గజ్జనపూడి గ్రామంలో వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు సోమ వారం పర్యటించారు. ఈ సందర్భంగా యల్లపు చంద్ర మౌళి కుమారుడు ఇటీవల ప్రమాదవశాత్తు చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థియ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలను ఆదుకోవడానికి నా వంతు సహకారాన్ని అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపిటిసి సభ్యులు మొల్లి వీరబాబు, మాజీ ఎంపిటిసి సభ్యులు అల్లి సత్తిబాబు, అనకాపల్లి నూకరాజు పాల్గొన్నారు.

త్వరలోనే మండల కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి - జగ్గంపేట

త్వరలోనే ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల కమిటీలను ఏర్పాటు చేస్తానని నూతనంగా జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన ప్రముఖ విద్యావేత్త ఒమ్మి రఘురామ్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కాకినాడ సూపర్ బజార్ కళ్యాణ మండపంలో రాష్ట్ర అధ్యక్షులు మంచాల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కౌతారపు ప్రసాద్ పర్యవేక్షణలో జిల్లా అధ్యక్షులు సతీష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో తనను జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేశారని తెలిపారు. నూతన కమిటీ ఐక్యవేదిక ఆశయాలకు అనుగుణంగా పనిచేసి ప్రజలను అగహన పరులను చేస్తామని అన్నారు. జిల్లావ్యాప్తంగా మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని, అందుకు ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యత తీసుకోవాలని కోరారు.

నేడు ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - పెద్దాపురం

వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలకు ఈ నెల 10న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు పోలీస్ స్టేషన్‌లో సుమారు 20 వరకూ ఉన్నాయన్నారు. వీటిని 10వ తేదీ ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం వేస్తామన్నారు. ఆసక్తిగల వారు ఈ వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు.


గిరిబాబును శాలువాతో సత్కరిస్తున్నచిట్టికొండ

గిరిబాబును అభినందించిన చిట్టికొండ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును బిఎంపి అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ అందే చిట్టికొండ అభినందించారు. సోమవారం గిరిబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చిట్టికొండ మాట్లాడుతూ గిరిబాబు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గానికి తాతయ్య ముద్రగడ వీర్రాఘవరావు, తండ్రి ముద్రగడ పద్మనాభం ఎంఎల్ఎలుగా, మంత్రిగా, ఎంపీగా నియోజకవర్గానికి సేవలందించారని అన్నారు. గిరిబాబు కూడా రాజకీయాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

కొండయ్యచౌదరిని పరామర్శించిన జ్యోతుల

ప్రజాశక్తి - గండేపల్లి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జ్యోతుల నవీన్

మండలంలోని జడ్.రాగంపేటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు కందుల కొండయ్య చౌదరిని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పరామర్శించారు. ఇటీవల కొండయ్య చౌదరి మాతృమూర్తి సూర్యకాంతం మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన దినకర్మలో నవీన్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పింఆరు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, అడబాల వెంకటేశ్వరరావు, కంచుమర్తి రాఘవ, చింతమనేని చంటిబాబు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - శంఖవరం



ల్యాప్‌టాప్‌లను అందుకుంటున్న విజేతలు

స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ నెల 7న కాకినాడలో జరిగిన ధీరు బాయ్ అంబానీ జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మోడల్ స్కూల్‌కి చెందిన వై.బాలమురళి, ఎస్.స్వాతి ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు డిఇఒ పి.రమేష్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు. విజేతలను స్కూల్ ప్రిన్సిపల్ కె.కృష్ణవేణి, కమిటీ ఛైర్మన్ జి.లక్ష్మీజ్యోతి, ఎంఇఒలు ఎస్‌వి.రమణ, గోవింద్, అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - శంఖవరం

స్థానిక పిహెచ్‌సిలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల ఆరోగ్య అధికారి డాక్టర్ ఆర్‌వివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పిఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో డాక్టర్ శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్‌కుమార్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. గర్భిణులకు ఎఫ్ఎన్ఒ నీలిమ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.